క్లుప్తంగా

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం



మాట్లాడుతున్న నిర్వాహకురాలు సౌమ్య

జగిత్యాల: విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమని ఉన్నతి సంస్థ నిర్వాహకురాలు సౌమ్య అన్నారు. మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం టాస్క్ ఆధ్వర్యంలో ఉన్నతి సంస్థ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్ నేర్చుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ సహకారంతో విద్యార్థులకు 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, వాసవి, వరప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించుకోవాలని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. గురువారం జిల్లా ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో శ్రీ నిధి పాఠశాలకు చెందిన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్‌పై షార్ట్‌ఫిల్మ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎస్సై సందాని పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

జగిత్యాల: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఎస్సై కృష్ణ అన్నారు. జిల్లా మెడికల్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి మెసేజ్‌లు వచ్చినా వాటిని నమ్మకూడదని, వాట్సాప్‌కు వచ్చిన లింక్‌లు క్లిక్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ సురక్ష కేంద్రంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సింధూజ

కథలాపూర్: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన సంపూర్ణ సురక్ష కేంద్రం గురించి గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారులు వినోద్, సింధూజ అన్నారు. కథలాపూర్ పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రంలో హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధులకు కౌన్సెలింగ్ ఇస్తూ అన్ని రకాల పరీక్షలు చేస్తారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో సంపూర్ణ సురక్ష కేంద్రం కౌన్సిలర్ మల్లికార్జున్, మేనేజర్ సంతోష్, సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



రాయికల్/మల్లాపూర్/వెల్గటూర్/మల్యాల: మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ పాల్గొని హుషారుగా ఆనందంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగులు పూసుకుంటూ, హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. జీవితం రంగుల మయం కావాలంటూ విద్యార్థులకు హోలీ పండుగ ప్రాధాన్యత వివరించారు.

బిల్లులు రాక.. పనులు సాగక

- హైలెవల్ వంతెనలకు లభించని మోక్షం
- వాహనదారులు ఇబ్బందులు



ఇబ్రహీంపట్నం- వర్షకొండ దారిలో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్



యామాపూర్ - ఫకీర్‌కొండాపూర్ దారిలో నిలిచిపోయిన హైలెవల్ వంతెన పనులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మరికొన్ని చోట్ల కాంట్రాక్టర్లు ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో వాహనదారులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ప్రతిపాదించిన హైలెవల్ వంతెనలకు నిధులు మంజూరు కాలేదు. మండలంలో 6 లో లెవల్ వంతెనలు ఉండగా, ప్రతీ వర్షాకాలంలో లోలెవల్ వంతెనలు మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. మెట్‌పల్లి- మూలరాంపూర్ దారిలో తిమ్మాపూర్ వద్ద ఒకటి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ వెళ్లేదారిలో ఒకటి, ఇబ్రహీంపట్నం నుంచి బట్టాపూర్ వెళ్లే దారిలో 2, కోమటికొండాపూర్ నుంచి ఎర్దండికి వెళ్లే దారిలో 2 లోలెవల్ వంతెనలు ఉన్నాయి. మండలంలోని వర్షకొండ చుట్టూ లో లెవల్ వంతెనలు ఉండటంతో వర్షాకాలం రాకపోకలు నిలిచిపోయి గ్రామస్తులు ఏటూ వెళ్లలేదని పరిస్థితి ఉంటుంది. దీంతో హైలెవల్ వంతెనలను నిర్మించాలని మండలంలోని ప్రజాప్రతినిధులకు పలుసార్లు ప్రజలు విన్నవించారు.

రూ. 13 కోట్ల నిధులు మంజూ

హైలెవల్ వంతెనల నిర్మాణానికి 2 ఏళ్ల క్రితం రూ. 13 కోట్ల నిధులు మంజూరుకాగా, అధికారులు టెండర్లు పిలిచారు. 2023 జూన్‌లో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు 9 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. కానీ పలు చోట్ల కొంత మేర పనులు చేసినా.. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. గోధూర్- మూలరాంపూర్ వెళ్లే దారిలో ఒక హైలెవల్ వంతెన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించకపోవడంతో వాహనదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం, వర్షకొండ రోడ్డులో రెండు లో లెవల్ వంతెనలు ఉన్నాయి. ప్రతీ వర్షాకాలంలో వంతెనల నుంచి నీళ్లు ప్రవహిస్తూ రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నాం. హైలెవల్ వంతెనల నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలి.

పోనకంటి వెంకట్, మాజీ ఎంపీటీసీ, వర్షకొండ

వర్షాకాలంలో ఇబ్బందులు



వర్షాకాలం వస్తే చాలు, లో లెవల్ వంతెనల పై నుంచి వరద నీటితో ఇబ్బందులు పడుతున్నాం. వంతెనల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో బ్రిడ్జి పక్కనే తాత్కాలిక రోడ్డు వేయడంతో వర్షాకాలం భారీ ప్రవాహానికి కొట్టుకపోయి వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. వెంటనే హైలెవల్ వంతెన నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి

గుంటి లక్ష్మి, మాజీ సర్పంచ్, ఫకీర్‌కొండాపూర్

కాంట్రాక్టర్లకు నోటీసులు

హైలెవల్ వంతనెల నిర్మాణం ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే పనులు ప్రారంభించాలని నోటీసులు ఇచ్చాం. కొద్ది రోజుల క్రితం సంబంధిత కాంట్రాక్టర్లతో ఎస్ఈ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాం. వెంటనే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

మహమ్మద్ ఫైజాన్, ఎఈ,ఆర్అండ్‌బీ, మెట్‌పల్లి

ప్రతీ ఒక్కరు వ్యాయామం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల: ప్రతీ ఒక్కరు వ్యాయామం తప్పకుండా చేయాలని ఎస్‌కేఎన్ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం, జాతీయ నో స్మోకింగ్ డే పురస్కరించుకుని కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, శారీరక వ్యాయామంతో పాటు, షుగర్, రక్తపోటును నిరంతరం అదుపులో ఉంచుకోవాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, చక్కని జీవన శైలితో కిడ్నీల ఆరోగ్యం మెరుగుపర్చుకోవచ్చన్నారు. అలాగే యువత ధూమపానానికి అలవాటు కావొద్దని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి రాజు, జీవీఆర్, సాయి మధుకుమార్, అంకం గోవర్ధన్, కె.సురేందర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



కంట్రోల్‌రూమ్ ప్రారంభించిన ఎస్ఈ

గొల్లపల్లి: వేసవికాలంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రకాల నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శాలియా నాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని గొల్లపల్లిలో 100 కేవీఏ 3 ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ గోపికృష్ణ, సివిల్ ఏడీఈ అనూప్, గొల్లపల్లి ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ రాకేశ్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో విద్యుత్ అధికారులు గురువారం పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. కార్యక్రమంలో కోరుట్ల ఏడీ ఆంజనేయరావు, ఏఈ శ్రీనివాస్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరిలో జాతర.. పాఠశాలకు సెలవు!

- హెచ్ఎం, ఎంఈవో మధ్య వాగ్వివాదం
- డీఈవో వద్దకు చేరిన పంచాయితీ



తాళం వేసి ఉన్న గుల్లకోట ప్రాథమిక పాఠశాల

గొల్లపల్లి: వెల్గటూర్ మండలం గుల్లకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం రాజిరెడ్డి తాళం వేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఊరిలో నిర్వహించే శ్రీవేణుగోపాలస్వామి జాతర సందర్భంగా స్కూల్‌కు సెలవు ప్రకటించారు. అయితే ఎంఈవో అనుమతి తీసుకోకుండానే నిర్ణయం తీసుకోవడంతో పక్కనే ఉన్న హైస్కూల్ ఉపాధ్యాయులు కూడా అవాక్కయ్యారు. విషయం తెలుసుకున్న ఎంఈవో హెచ్ఎంను ప్రశ్నించగా దుర్భాషలాడినట్లు సమాచారం. ఈ ఇద్దరి పంచాయితీ చివరకు డీఈవో వద్దకు చేరింది. గుల్లకోటలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు బోధిస్తున్నారు. సుమారు 180 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈనెల 15న గ్రామంలో శ్రీవేణుగోపాలస్వామి జాతర ఉంది. ఈ క్రమంలో హెచ్ఎం రాజిరెడ్డి పాఠశాలకు గురువారం సెలవు ప్రకటించి ఏకంగా తాళం వేశాడు. విషయాన్ని కొందరు ఎంఈవో రాంచంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన హుటాహుటిన పాఠశాలకు చేరుకోగా తాళం వేసి ఉండటంతో హెచ్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. దీనికి ఆయన ఒక్కసారిగా దుర్భాషలాడినట్లు ఎంఈవో తెలిపారు. ఇదే విషయాన్ని ఎంఈవో డీఈవోకు ఫోన్‌లో వివరించారు. పాఠశాలకు తాళం వేసిన విషయంపై హెచ్ఎం రాజిరెడ్డిని వివరణ కోరగా.. గ్రామంలో వేణుగోపాలస్వామి జాతర ఉండడంతో సెలవు ఇచ్చామని, విషయాన్ని ఒక రోజు ముందుగానే ఎండపల్లి స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎంకు తెలిపానని, నిబంధనలకు లోబడే నిర్ణయం తీసుకున్నానని వివరించారు. ఎంఈవోకు మూడు రోజుల ముందుగానే ఫోన్ ద్వారా విషయం చెప్పానన్నారు. దీనిపై స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ స్పందిస్తూ.. స్థానికంగా సెలవు ప్రకటించుకునే వీలు హెచ్ఎంకు ఉంటుందని, సెలవు విషయాన్ని తమకు వాట్సాప్ ద్వారా, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని తెలిపారు. దీనిపై డీఈవో మాట్లాడుతూ.. హెచ్ఎం, ఎంఈవో మధ్య సమన్వయం లేకనే ఇలా జరిగిందని, పూర్తిస్థాయిలో విచారణ చేపడతానని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు, 7,8,9,10 తరగతుల్లో ఖాళీ ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు డీఈవో రాము తెలిపారు. స్వీకరణకు ఈనెల 23 వరకు గడువు ఉందని, వచ్చేనెల 15 వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గొడ్డలితో దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లి లో ఈనెల 3న యాగండ్ల లక్ష్మిపై గొడ్డలితో దాడిచేసిన ఆమె మరిది చిన్నరాజంను అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఇద్దరి మధ్య భూవివాదంలో లక్ష్మిని గొడ్డలితో వీపు భాగంలో కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నరాజంను రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా అందె మారుతి

మెట్‌పల్లి: కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా అందె మారుతిని నియమితులయ్యారు. ఇంతకాలం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మారుతిని రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తన నియమాకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ దినోత్సవం

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం కిడ్నీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ సంరక్షణ పై రోగులకు అవగాహన కల్పించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత ,వైద్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గ్రామసేవకుడు మృతి

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లిలో గ్రామసేవకుడు బండి గంగారాం(60) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఆర్ఐలు సురేశ్, రాజేశ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. వీఆర్ఏ సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.రఫీ రూ.5,000ల ఆర్థిక సాయం అందజేశారు..

దావన్‌పల్లికి బస్సు పునరుద్ధరించాలి

రాయికల్: మండలంలోని దావన్‌పల్లి గ్రామానికి జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మాజీ సర్పంచ్ రెబ్బాస్ మల్ల య్య గురువారం జగిత్యాల డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేసినందుకు జరిమానా

గొల్లపల్లి: సామాజిక మాధ్యమాల్లో దూషిస్తూ.. అసత్య ప్రచారం చేసిన ఘటనలో గొల్ల పల్లి మండలం తిర్మలాపూర్‌కు చెందిన ఎండీ.నజీర్ పాషాకు రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల రెండో అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వినీల్‌కుమార్ తీర్పునిచ్చారు. గ్రామానికి చెందిన ఎరవేని రమేశ్‌పై గతంలో అదే గ్రామానికి చెందిన ఎండీ.నజీర్ పాషా సోషల్ మీడియాలో రమేశ్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తూ.. దూషించాడు. దీంతో రమేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై జీవన్‌రెడ్డి నజీర్‌పాషాపై కేసు నమోదు చేశారు. సాక్షులను ప్రవేశపెట్టగా నిందితుడికి రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

గ్రూప్–2 ఫలితాల్లో 155వ ర్యాంకు

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాలకు చెందిన రేణు మోహన్ గ్రూప్–2 ఫలితాల్లో స్టేట్ 155వ ర్యాంకు సాధించారు. మోహన్ ప్రస్తుతం నిజామాబాద్ బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. దీనిపై తల్లిదండ్రులు, మిత్రబృందం హర్షం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవం



రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, గ్రామ నాయకులు గంగారెడ్డి, ఆదిరెడ్డి, నీరటి శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

రాయికల్: మండలంలోని ఆలూరు పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జీవరత్నం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం విజయ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో అటవీప్రాంతం నుంచి నేరుగా వరదల ద్వారా వచ్చే నీరు ఎస్సారెస్పీ డీ 53 కాలువలోకి చేరుతుంది. నీటితో పాటు పెద్ద ఎత్తున ఇసుక, మట్టి ప్రధాన కాలువలోకి వచ్చి పేరుకుపోతుంది. అటవీప్రాంతం నుంచి వచ్చే వరద నీటిని కాలువలోకి రాకుండా సైఫన్ నిర్మాణం చేపడితే సమస్య ఉండదని రైతులు పేర్కొంటున్నారు. మట్టి, ఇసుక చేరడంతో నీటి ప్రవాహం తగ్గిపోతుందని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నారాయణరెడ్డి, ఈఈ, ఎస్సారెస్పీ,సెల్ నం: 9701379634

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాలటౌన్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ కోరారు. సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్ పరిపాలనాధికారికి గురువారం ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడంతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుంటుపడిందని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న ఫీజ్ రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కుందారపు రాజు, జోనల్ ఇంచార్జి నిఖిల్, జశ్వంత్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారుల నిర్లక్ష్యం'

బుగ్గారం: జిల్లా వ్యాప్తంగా అవినీతే రాజ్యమేలుతుందని ఉన్నతాధికారులు సైతం అవినీతి,అక్రమాలు చేసేవారికే మద్దతుగా ఉంటున్నారని ప్రముఖ హక్కుల కార్యకర్త,ఆర్టీఐ ఉద్యమకారుడు చుక్క గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు బుగ్గారంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో నిధుల దుర్వినియోగంపై తాను ఏళ్లుగా పోరాటం చేస్తూ అనేక అవినీతి,అక్రమాలపై తగిన ఆధారాలు సేకరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఇచ్చినా, స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్‌ను లోకాయుక్త ఆదేశించినా నేటికీ ఏలాంటి చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మండలంలోని గోపులాపూర్‌లో శ్రీలక్ష్మీనరసింహ వైన్స్‌లో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు



నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని లేని పక్షంలో సీఎం రేవంత్‌కు మాదిగల నుండి తిరుగుబాటు తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ చేపట్టిన నిరసన దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాతే అన్ని ప్రభుత్వ ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు నురుగు శ్రీనివాస్, బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, నక్క గంగారాం, నక్క రమేష్, సంకెపు ముత్తు, సురేందర్ పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మొదటిరోజు మహాలక్ష్మి, నల్ల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, సార్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గురువారం డప్పు చప్పులు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు సమర్పించి గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా యజ్ఞ పూజ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి శాంతి యజ్ఞం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, ఆలయ చైర్మన్ బర్మ మల్లయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను గురువారం అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. గోదావరినది, పెద్దవాగుల నుంచి కొందరు ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక వేలం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఇటీవల పట్టుకున్న ఇసుకను గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు. వేలంలో ఇసుకను పిట్టల వంశీ దక్కించుకున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.